
సాక్షి
ఒడిశా

ఆదివారం । 7 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,35,059
బంగారం	950 మిల్లీ గ్రాములు
వెండి	23 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



స్తంభించిన రవాణా

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు శనివారం నిరసన తెలిపారు.

- 8లో.



మంత్రి కారు ఢీకొని బాలుడికి గాయాలు

రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ నరక కారు ఢీకొన్న ఘటనలో ఆరేళ్ల బాలుడు తీవ్రగాయాలు పాలయ్యాడు.

- 8లో.

న్యూస్‌రీల్

యువకుడి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న కిరణ్ మృతదేహం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమీపంలో గల అటవీ ప్రాంతంలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి నువాపడ జిల్లాకు చెందిన కిరణ్ మాఝి (26)గా పోలీసులు గుర్తించారు. కొంతమంది ఉదయం అటువైపుగా బహిర్భూమికి వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న ఒక యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మునిగుడ పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ సౌదామిని బెహర సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మునిగుడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వద్ద దొరికిన ఆధారాలతో యువకుడు నువాపడ జిల్లాకు చెందిన వాడిగా గుర్తించినట్లు బెహర తెలియజేశారు. దీనిపై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులిగోర్లు అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న పులి గోర్లు, పళ్లు



అరెస్టైన రవి సబర్

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి అటవీ శాఖ అధికారులు పులి గోర్లు, పళ్లు అమ్ముతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీహార్ రాష్ట్రం నుంచి కొందరు యువకులు ఇక్కడ పనులు చేయడానికి వచ్చారు. వారంతా పగటి సమయంలో పనులు చేస్తూ, రాత్రి సమయంలో సమీప అడవిలో వన్య ప్రాణులను హతమార్చి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మత్తిలి సమితిలో పులి గోర్లు, పళ్లను అమ్మేందుకు యువకుడు శుక్రవారం ఇంటింటికీ వెళ్తున్నాడు. స్థానికులు అటవీ శాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో నిందితుడిని అధికారులు పట్టుకున్నారు. అతడి వద్ద పులి గోర్లు, చర్మం, పళ్లు దొరికాయి. నిందితుడు బీహార్‌కు చెందిన రవి సబర్‌గా నిర్ధారించారు. అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

శరవేగంగా
ప్రాకార ప్రాజెక్టు పనులు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా
- పట్టణంలో సీసీటీవీ నిఘా: ఏడీజీ సంజయ్ కుమార్



సూచనలిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవ ముహూర్తం సమీపిస్తుండడంతో శరవేగంగా పనులు చేపడుతున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలియజేశారు. ప్రాకార ప్రాజెక్టు పురోగతిపై పూరీ సర్క్యూట్ హౌస్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. నిర్మాణ పనులు, పారిశుద్ధ్యం, రవాణా, తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరాపై చీఫ్ సెక్రటరీ సమీక్షించారు. ప్రాకార ప్రాజెక్టుకు సంబంధించిన పనులన్నీ 12వ తేదీ సాయంత్రంలోగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. లోకార్పణ మహోత్సవం పురస్కరించుకుని విచ్చేసే యాత్రికులు, అతిథులు ఇతరేతర అన్నివర్గాలకు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నేపథ్యంలో వాహనాల రద్దీ ఇబ్బందికరంగా తలెత్తకుండా పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు వివరించారు.

14 నుంచి పోలీసు భద్రత

ప్రాజెక్టు పనులు పూర్తయ్యాక ప్రాజెక్టును ఆలయ పాలన యంత్రాంగానికి అప్పగిస్తారు. ఈనెల 14 నాటికి ఈ ప్రాంతం భద్రతను పోలీసు శాఖ తీసుకుంటుందని చెప్పారు. 17న జరగనున్న ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం బొడొదొండొకు ఇరువైపులా భవనాల పైకప్పులపై ఏర్పాట్లు చేయనున్నారు. పూరీ జిల్లా కలెక్టర్ ఇప్పటికే దూద్‌వాలా ధర్మశాల, బగాడియా ధర్మశాల, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాధావల్లభ్ మఠం, ప్రతిహార్ నియోగుల కార్యాలయం మరియు సింహద్వార్ సమాచార కేంద్రంతో సహా వివిధ మఠాలు, భవనాల యజమానులకు లేఖ రాశారు. ప్రాజెక్టు ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ప్రారంభోత్సవానికి ముందే పూర్తి చేస్తామని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణం మొత్తం గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ఆ రోజు యాత్రికుల వాహనాల కోసం సమంగలో కొత్త పార్కింగ్ స్థలాన్ని ఉపయోగించనున్నట్లు తెలిపారు.

ప్రచార రథం ప్రారంభం

శనివారం ప్రచార రథం ప్రారంభమైంది. ప్రారంభోత్సవం రోజున ఆచారాల సమయంలో బియ్యం, వక్క, తమలపాకులు సేకరించే ప్రక్రియ కూడా ప్రారంభమవుతుంది. 16వ తేదీలోపు 800 మీటర్ల పొడవైన శ్రీదండ్ రోడ్డు పనులు పూర్తవుతాయి. ఆలయానికి నాలుగు వైపులా తులసీ మొక్కలను పెంచడం వల్ల ఇది భక్తులకు ప్రధాన ఆకర్షణగా మారింది. ప్రారంభోత్సవం రోజున సందర్శకులతో పాటు వీఐపీలకు, భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనానికి తగిన భద్రతా చర్యలు తీసుకుంటామని జెనాతో పాటు వచ్చిన పోలీసు అదనపు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) సంజయ్ కుమార్ తెలిపారు. శ్రీమందిర్ ప్రాకార ప్రాజెక్టు లోకార్పణ మహోత్సవం సందర్భంగా పూరీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. పూరీని బ్లాంకెట్ సెక్యూరిటీలో ఉంచుతారు. వీఐపీలు, సామాన్య భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. పూరీ పట్టణం సీసీటీవీ జోన్ పరిధిలోకి రానుంది. ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు.



పనులు పరిశీలిస్తున్న సీఎస్ ప్రదీప్ కుమార్ జెనా తదితరులు

నువాగాంవ్ రోడ్ - దసపల్లా
రైలు మార్గం ప్రారంభం




జెండా ఊపి రైలు సేవలు ప్రారంభిస్తున్న మంత్రి అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: నువాగాంవ్ రోడ్ - దసపల్లా మధ్య కొత్తగా నిర్మించిన రైలు మార్గాన్ని దసపల్లా రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర రైల్వే, సాంకేతిక సమాచారం, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన దసపల్లా రైల్వేస్టేషనకు 4 ప్యాసింజర్ రైలు సేవలను విస్తరించారు. వీటిలో భువనేశ్వర్–నయాగడ్ టౌన్ మధ్య నడుస్తున్న 18423, 18424 ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–నువాగాంవ్ మధ్య నడుస్తున్న 08429, 08430 ప్యాసింజర్ స్పెషల్, పూరీ – నువాగాంవ్ మధ్య నడుస్తున్న 08423, 08424 ప్యాసింజర్ స్పెషల్, నయాగర్ టౌన్ – భద్రక్ మధ్య నడుస్తున్న 08555, 08556 మెమూ రైళ్లు ఉన్నాయి.

ఫుల్బాణికి రైలు మార్గం

భారతీయ రైల్వే మ్యాప్‌లో కందమాల్ జిల్లా ప్రధాన కార్యాలయ కేంద్రం ఫుల్బాణిని చేర్చడానికి సమీక్షించనున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీనికోసం గోపాల్‌పూర్ – రైరాఖోల్ కొత్త రైలు మార్గం నిర్మాణం కోసం యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఖండపడా ప్రాంతానికి రైలు సేవలు కల్పించే యోచనతో రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ ప్రాంతానికి రైలు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఖుర్దా–బొలంగిర్ రైలుమార్గ ప్రాజెక్ట్‌లో కొంటిలో మరియు ఖండపడ ప్రాంతాలను జోడించడంలో సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. భువనేశ్వర్‌ను ప్రపంచ శ్రేణి స్టేషనుగా మలిచేందుకు రైల్వే శాఖ ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు.

మొసళ్ల లెక్కింపు ప్రారంభం



గోడాహద్ డ్యామ్‌లో సంచరిస్తున్న మొసలి

బరంపురం: గంజాం జిల్లాకే గర్వకారణమైన గోడాహద్ నది డ్యామ్‌లో ఈ ఏడాది మొసళ్ల లెక్కింపు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. గంజాం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో గోడాహద్ డ్యామ్‌లో 10 బృందాలుగా విడిపోయి అటవీ శాఖ అధికారులు లెక్కింపు చర్యలు చేపట్టారు. 8 ఏళ్ల క్రితం నగరానికి దగ్గరలోని గోడాహద్ నది డ్యామ్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంతో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొసళ్ల సంతాన అభివృద్ధి చేపట్టింది. 10 ఏళ్ల డ్యామ్‌లో 5 మొసళ్లతో ప్రారంభించగా, ప్రతీ ఏడాది వీటి సంతాన అభివృద్ధి సంఖ్య పెరుగుతోంది. 2023 నాటికి వీటి సంఖ్య 65కి చేరింది.



సంచరిస్తున్న మొసళ్లు

ఆస్పత్రికి తాళాలు..
రోగులకు ఇబ్బందులు



తాళాలు వేసి ఉన్న కుమిలి ఆస్పత్రి



వైద్యం కోసం తీసుకొచ్చిన విద్యార్థిని

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొరిగుమ్మ సమితి కుమిలి వైద్య కేంద్రం నియమిత వేళల్లోనే పనిచేస్తుండడంతో చికిత్స కోసం వస్తున్న రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం కుమిలి ఆస్పత్రికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి కిశోర్ చంద్ర డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న గాయిత్రి తండి అనే విద్యార్థిని అకస్మాత్తుగా పడిపోయింది. దీంతో కళాశాల సిబ్బంది విద్యార్థినిని కుమిలి వైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికి మధ్యాహ్నం 3 గంటల సమయం అవుతుండగా, ఆస్పత్రికి తాళాలు వేసి ఉన్నాయి. దీంతో చేసేదేమీ లేక స్థానికంగా ఉన్నటువంటి మెడికల్ షాపులో ఇచ్చిన మందులను వేశారు. అయితే కుమిలి వైద్య కేంద్ర డాక్టర్ బిరంచి నారాయణ పుష్టి బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రిలో పనిచేస్తూ, కుమిలి వైద్య కేంద్రంలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కుమిలి వైద్య కేంద్రం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అనంతరం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. అయితే మారుమూలన ఉన్నటువంటి ఈ ప్రాంతంలో పర్మినెంట్‌గా వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్సైజ్ అధికారుల ఉక్కుపాదం

- నాటుసారా స్థావరాలపై ముమ్మర దాడులు



భూమిలో పాతిపెట్టిన సారా డ్రమ్ములు వెలికితీస్తున్న ఎక్సైజ్ అధికారులు



చికిటిలో అరెస్టైన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గంజాం జిల్లా ఎక్సైజ్ అధికారులు వివిధ ప్రాంతాల్లో దాడులు ముమ్మరం చేశారు. లక్షలాది రూపాయలు విలువచేసే నాటుసారా, విదేశీ మద్యం, గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. శనివారం నగర చుట్టుపక్కల దిగపండి, చికిటి, పత్రపూర్ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో రహస్యంగా తయారు చేస్తున్న వంటసార బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడిచేసి, సుమారు 2 వేల లీటర్ల విప్పపువ్వు ఊటసారాని నష్టం చేశారు. అలాగే సారా తయారీ వంట సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గొళంతరా పోలీసుస్టేషన్ పరిధి కుసిమి ప్రాంతంలోని ఒక గోదాంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన వందలాది విదేశీ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. దాడులకు సంబంధించి నిందితులను అరెస్టు చేసినట్లు బరంపురం ఎక్సైజ్ అధికారి వివేకనంద నాయక్ తెలియజేశారు.



రొంగాయిలొండాలో స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు



చమ్మఖండిలో అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

సమరానికి సన్నద్ధం

- ఎన్నికల ప్రచారానికి బీజేపీ సన్నాహాలు
- 21 మంది కేంద్ర నాయకులతో ప్రచారం నిర్వహించే యోచన

భువనేశ్వర్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి భారతీయ జనతా పార్టీ సమాయత్తమవుతోంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్న కాషాయ పార్టీ ఈసారి అధికారంలోకి వచ్చి పాలన పగ్గాలు చేపట్టాలని ఉవ్విళ్లూరుతోంది. ఈసారి జరిగే ఎన్నికల్లో 51 శాతం ఓట్లు సాధించే యోచనతో పార్టీ ప్రముఖ శ్రేణుల సంప్రదింపులతో వ్యూహాత్మక ఎన్నికల శైలిని రూపొందించడంలో తలమునకలై ఉంది. రాష్ట్రంలో 2022 సంవత్సరంలో ముగిసిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం బిజూ జనతా దళ్ 53 శాతం సింహ భాగం ఓట్లతో ఏకైక బలమైన పార్టీగా నిలిచింది. అయితే త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ పరిస్థితి తలకిందులు చేస్తామని బీజేపీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ప్రచార వ్యూహం

పదునైన ప్రచారంతో ఓటర్ల మనసు దోచుకునే ప్రయత్నంలో అగ్రశ్రేణి నేతలు కసరత్తు చేస్తున్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు ప్రవేశపెట్టిన ప్రజా ప్రయోజన ఆకర్షణీయమైన పథకాల ఫలితాల వివరాలను ఓటరు ఇంటి ముంగిట ప్రదర్శించడం వ్యూహంలో ప్రధాన శీర్షిక. ఈ పథకాల అమలు, కార్యాచరణలో రాష్ట్ర ప్రభుత్వం గిమ్మిక్కులు ప్రజల ముంగిట బహిరంగ పరచి చైతన్యపరిచే లక్ష్యంతో ప్రచారానికి బీజేపీ సిద్ధమవుతోంది.

కేంద్ర నాయకులతో ప్రచారం

ఈ ఏడాది జరగనున్న ఉభయ లోక్‌సభ, రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేస్తుంది. అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటుతుందని ఆ పార్టీకి చెందిన నాయకుడు జయనారాయణ మిశ్రా ఘంటాపథంగా తెలిపారు. ఎన్నికల ప్రచారానికి పలువురు కేంద్ర నాయకులు రాష్ట్రానికి విచ్చేయనున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ త్వరలో రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ నియోజకవర్గాల్లో 21 మంది కేంద్ర నేతలు పర్యటిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బి.ఎల్. సంతోష్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సాల్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ సమక్షంలో 2024 ఎన్నికల కోసం పార్టీ వ్యూహ రచన తుది మెరుగులు దిద్దుకుంటుంది.

51 శాతం ఓట్లు మావే

2024 సార్వత్రిక ఎన్నికల్లో 51 శాతం ఓట్లను సాధించాలని కాషాయ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో బూత్ నిర్వహణపై దృష్టి సారించి పార్టీని బలోపేతం చేసేందుకు నిరంతర సన్నాహాల్లో పార్టీ ప్రముఖులు తలమునకలై ఉన్నారు. ఈ నేపథ్యంలో తరచూ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు, వివిధ పార్టీ విభాగాల నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ధన బలం, అధికార దుర్వినియోగం, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రయోగంతో బూత్‌లను కబ్జా చేసేందుకు అధికార పార్టీ చేస్తున్న అన్ని కుట్రలను తిప్పికొడతామని విపక్ష నేత జయ నారాయణ మిశ్రా సవాలు విసిరారు. ప్రతి బూత్, వార్డు స్థాయిలో సంస్థను బలోపేతం చేయడానికి ఓటరుకు మరింత చేరువయ్యే యోచనతో రాష్ట్రంలో కోటి కుటుంబాలను చేరుకుని చైతన్యపరుస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో గుమ్మిధామ్ ఆశ్రమాధిపతులు



ఆశ్రమాధిపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలోని ప్రఖ్యాత గుమ్మిధామ్ ఆశ్రమాధిపతి గుమ్మి వాలీమాత, ఉత్తరాధికారి జాగృతిదేవిలు తొలిసారి దక్షిణాది యాత్రల్లో భాగంగా అరసవల్లి ఆదిత్యాలయానికి శనివారం విచ్చేశారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. వాలీమాత, జాగృతిదేవిలు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం వర్ధిల్లాలని, ఇక్కడి పూజా విధానాలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. అనంతరం ఈవో వి.హరిసూర్యప్రకాష్ ఆదిత్యుని జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, షణ్ముఖ శర్మ, ఫణీంద్రశర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొనగా..వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ బందోబస్తు నిర్వహించారు.

ఎలుగు హల్‌చల్

మందస : ఉద్దాన ప్రాంతాన్ని ఎలుగుబంట్లు భయపెడుతున్నాయి. మందస మండలం భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలో ఎలుగుబంట్లు స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. ఉదయాన్నే జీడితోటలకు, సొంత పనులకు వెళ్తున్న రట్టి ప్రజలకు సమీపంలోని తోటల్లో రెండు ఎలుగుబంట్లు కనిపించాయి. దీంతో భయంతో పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత కుక్కలు వెంబడించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

వరి కుప్పలు దగ్ధం



మంటలార్పుతున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని ఆంపురం పంచాయతీ పెంగువాడలో లంబ సూరయ్యకు చెందిన మూడు ఎకరాల వరికుప్పలు (ఇంకా నూర్చలేదు) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం విద్యుత్ తీగలు తెగిపడి మంటలు వ్యాపించినట్లు గ్రామస్తులు, సర్పంచ్ జమ్మయ్య తెలిపా రు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీనిపై తహశిల్దా ర్ సరోజిని స్పందిస్తూ సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తామని తెలిపారు.

నేడు ఉత్తరాంధ్ర రైతు సదస్సు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉత్తరాంధ్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ప్రముఖ విద్యావేత్త, పల్సస్ గ్రూప్ ఆఫ్ అధినేత గేదెల శ్రీనుబాబు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులకు వ్యవసాయంలో మెలకువలు, అధునాతన వ్యవసాయంపై దృష్టి పెట్టేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతు కుటుంబాల నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ సదస్సుకి జిల్లాలో రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పురుగుల మందు తాగి యువతి మృతి

నందిగాం: మండంలోని కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడకు చెందిన తరిణి లలిత(23) పురుగుల మందు తాగి మృతి చెందింది. నందిగాం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్యాడకు చెందిన వ్యవసాయ కూలీలు తరిని వైకుంఠరావు, నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కుమార్తె లలిత. ఈమెకు ఫిట్స్‌తో బాధపడుతోంది. వ్యాధి తీవ్రత పెరగడంతో బాధ తట్టుకోలేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందింది.

బులెట్ బైక్ చోరీ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్-2లో ఓ ఇంటి వద్ద బులెట్ బైక్ చోరీకి గురైంది. గాంధీనగర్‌కు చెందిన శ్రీధర్ అనే సెల్‌ఫోన్ వ్యాపారి తెలుపు రంగు బులెట్ వాహనాన్ని తన ఇంటి వద్ద హ్యాండిల్ లాక్‌వేసి ఉంచారు. శనివారం వేకువజామున ఓ యువకుడు వచ్చి తాళం పెకిలి వాహనాన్ని స్టార్ట్ చేయకుండా నడిపించుకుంటూ పరారయ్యాడు. ఈ సన్నివేశం సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇదే వీధిలో రమేష్ అనే వ్యక్తికి చెందిన పల్సర్ బైకు సైతం నెలరోజుల కిందట చోరీకి గురైంది. సీసీ ఫుటేజీలో దృశ్యం కనిపించినప్పటికీ పోలీసులు పట్టుకోలేకపోయారు. వరుసగా బైకు దొంగతనాలు జరుగుతున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు సీఐ నవీన్‌కుమార్‌కు విన్నవించారు.

స్తంభించిన రవాణా

- కొత్త హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా డ్రైవర్ల ఆందోళన
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు
- కొనసాగనున్న ఆందోళన..?
- పెట్రోల్ కోసం బంక్‌ల వద్ద బారులు



పెట్రోలు కోసం బారులుతీరిన వినియోగదారులు



ఒడిశా డ్రైవర్ మహాసంఘ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారతీయ న్యాయ సంహిత కింద తీసుకొచ్చిన కొత్త హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు శనివారం నిరసన తెలిపారు. దీంతో వాణిజ్య వాహనాలు, బస్సుల రవాణా స్తంభించి రాష్ట్రంలో జనజీవనం ప్రభావితమైంది. ఒడిశా డ్రైవర్ మహాసంఘ్ ఆధ్వర్యంలో డ్రైవర్లు రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాకు దిగారు. దీంతో ప్రధాన బస్టాండ్‌లు నిర్మానుష్యంగా మారాయి. కటక్ నేతాజీ బస్ టెర్మినల్, బాలాసోర్, సంబల్‌పూర్, ఢెంకనాల్, జాజ్‌పూర్, కొరాపుట్, బెర్హంపూర్ ఇతర ప్రాంతాల్లో ఆందోళన ప్రభావం కనిపించింది.

శాంతియుతంగా ధర్నా

బంద్ ప్రభావంతో సరుకు రవాణా చేసే వాహనాలు ఎక్కడికక్కడ రోడ్డుపై నిలిచిపోయాయి. సమ్మె పిలుపును బలవంతంగా ఏ డ్రైవర్‌పై విధించలేదని డ్రైవర్ల సంఘం తెలిపింది. ఇది ఒక గొప్ప ప్రయోజనం కోసం సోదరభావంతో సభ్యులందరికీ బహిరంగ పిలుపుగా సంఘం పేర్కొంది. శాంతియుతంగా ధర్నా చేయాలని డ్రైవర్లకు మహాసంఘ్ విజ్ఞప్తి చేసింది. ఎవరైనా డ్రైవర్ వాహనం నడుపుతూ కనిపిస్తే అతనితో అనుచితంగా ప్రవర్తించకుండా మర్యాదపూర్వకంగా అభ్యర్థించాలని మహాసంఘ్ అధ్యక్షుడు ప్రశాంత్ మెండులీ వీడియో సందేశం ప్రసారం చేశారు.

ప్రమాదాలు అరికట్టడానికి

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, వాటి వల్ల సంభవించే మరణాలను అరికట్టడానికి భారతీయ న్యాయ సంహిత కింద కొత్త హిట్ అండ్ రన్ చట్టం ప్రవేశపెట్టబడింది. ఈ చట్టం హిట్ అండ్ రన్ కేసులకు 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.7 లక్షలతో కఠినమైన జరిమానాలు విధిస్తుంది. దీనిని డ్రైవర్ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఒడిశా డ్రైవర్ల మహాసంఘం అఖిల భారత 'క్విట్ స్టీరింగ్' నిరసనలో చేరడంతో శనివారం రాష్ట్రంలో పాలు, పెట్రోల్, డీజిల్ ఇతరేతర అత్యవసర పదార్థాల రవాణా సహా వివిధ సేవలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే పెట్రోలు, డీజిల్ ఇంధన ద్రవ్యాలకు గిరాకీ పెరిగింది. ఆందోళన నిరవధికంగా కొనసాగుతుందనే భయాందోళనలతో ఈ పరిస్థితి తాండవించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పెట్రోల్, డీజిల్ అమ్మకాలు 20 శాతం పెరిగాయి.

దిగుమతిపై ప్రభావితం

డ్రైవర్ల ఆందోళన కారణంగా ఆయిల్ డిపోల్లో పెట్రోల్, డీజిల్ దిగుమతి 75 శాతానికి పైగా పడిపోయిందని ఉత్కల్ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజయ్ లాత్ తెలిపారు. శుక్రవారం 25 శాతం ఇంధనం మాత్రమే సరఫరా అయిందన్నారు. శనివారం పారాదీప్ డిపోలో ఇంధనం లోడింగ్ నిలిచిపోగా, జట్నీ మరియు బాలాసోర్ డిపోల్లో అంతంతమాత్రమే లోడింగ్ అయింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆదివారం మధ్యాహ్నానికి చాలా ఇంధన అవుట్ లెట్లు ఖాళీ అవుతాయని వెల్లడించారు. అదేవిధంగా బంద్ ప్రభావం పాల సరఫరాపై సైతం పడింది. ఒడిశా రాష్ట్ర సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (ఓంఫెడ్) డ్రైవర్ల ఆందోళనకారణంగా మార్కెట్‌కు పాలను రవాణా చేయలేక పోయిందని తెలిపారు. డెయిరీ ప్లాంట్ నుంచి కటక్, పూరీ, భువనేశ్వర్, కెంజొహర్ జిల్లాలకు 70,000 లీటర్లకు పైగా పాలు తరలించలేకపోయినట్లు ఓంఫెడ్ వర్గాలు తెలిపాయి.

సమ్మె నిలిపివేత: రవాణా కమిషనర్

కొత్త హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 'క్విట్ స్టీరింగ్' నిరసనలో భాగంగా ఒడిశా డ్రైవర్ల మహాసంఘ సభ్యులు చేపట్టిన సమ్మె శనివారం రాష్ట్రంలో నిలిపివేయబడిందని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ అమితాబ్ ఠాకూర్ తెలిపారు. నిరసనకారులతో సమావేశం అనంతరం ఈ ఫలితం సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చినందున తమ ఆందోళనను నిలిపివేయడానికి ఒడిశా డ్రైవర్లు అంగీకరించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, మహాసంఘాల మధ్య జరిగిన చర్చల్లో డ్రైవర్లు కోరిన చాలా డిమాండ్లు నెరవేరాయని, చర్చ అనంతరం ఆందోళనకు దిగిన డ్రైవర్లు తమ ఆందోళనను విరమించేందుకు అంగీకరించారని వెల్లడించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వంతో తమ చర్చలు కొనసాగుతున్నాయన్నారు.

ఆందోళన యథాతథం

అయితే రాష్ట్రంలో తమ నిరసన కొనసాగుతుందని ఆందోళనకారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక డిమాండ్లను నెరవేర్చినప్పటికీ, కొత్త హిట్ అండ్ రన్ చట్టంపై డ్రైవర్ల వ్యతిరేకతకు సంబంధించిన సమస్యను కేంద్రం పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో ఒడిశా డ్రైవర్ల మహాసంఘం నాయకుడు ఆదిత్య బెహరా మాట్లాడుతూ పలు అంశాలపై ప్రభుత్వంతో విస్తృత చర్చ జరిగింది. రాష్ట్రానికి సంబంధించిన పలు డిమాండ్లు నెరవేర్చేందుకు అధికారులు హామీ ఇచ్చారు. అయితే హిట్ అండ్ రన్‌పై కేంద్ర చట్టానికి సంబంధించిన అంశం ఇంకా పరిష్కారం కాలేదని, అందువలన ఆందోళన కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురు నిందితులు అరెస్టు



అరెస్టు చేసిన నిందితులు, సీజ్ చేసిన బైక్‌లు చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో రాయగడ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో శశిఖాల్ పంచాయతీ దిసారిగుడ గ్రామానికి చెందిన భభన్ ప్రధాని(22), కల్యాణ సింగుపూర్‌లోని బదవార్ వీధికి చెందిన అక్షయ గరడియా(26), రబి కౌసల్య (30)లు ఉన్నట్లు గుర్తించారు. ఐఐసీ కమలాకాంత్ కుహరో తెలిపిన వివరాలమేరకు.. ఇటీవల రాయగడ పట్టణంలో చోరీకి గురైన ద్విచక్ర వాహనాలకు సంబంధించి పోలీసులు దర్యాప్తు నిర్వహించారు. దీనిలో భాగంగా సదరు సమితి పితామహల్‌లో భభన్ ప్రధానిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా గరడియా, కౌలస్యల పేర్లు బయటకు వచ్చాయి. నిందితుల నుంచి ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితులను కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

మంత్రి కారు ఢీకొని బాలుడికి గాయాలు



బాలుడిని కారులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



బాలుడి తల్లిని ఓదారుస్తున్న మంత్రి సరక

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక కారు ఢీకొన్న ఘటనలో ఆరేళ్ల బాలుడు తీవ్రగాయాలు పాలైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. జిల్లాలోని కొలనరా సమితి బెల్‌కొన సమీపంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గాయాలైన బాలుడు బిసంకటక్‌లోని డెప్పాగుడ ప్రాంతానికి చెందిన గుణ్నాలు నవీన్ (6)గా గుర్తించారు. ఘటన జరిగిన వెంటనే మంత్రి అదేశాలతో గాయాలైన బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మంత్రి సరక కల్యాణ సింగుపూర్‌లోని జరిగిన ఒక కార్యక్రమానికి శనివారం హాజరై తిరిగి రాయగడ వస్తుండగా, బెల్‌కొన ప్రాంతంలో కారుకు ఎదురుగా వస్తున్న బాలుని ఢీకొన్నారు. బాలుడు తమ సొంత గ్రామం డెప్పగుడ నుంచి శుక్రవారం తన అమ్మమ్మ ఉంటున్న బెల్‌కొన గ్రామానికి తల్లిదండ్రులతో వచ్చాడు. శనివారం సాయంత్రం రోడ్డు పక్కన బాలుడు ఆడుతుంగా అటువైపు నుంచి వస్తున్న మంత్రి వాహనం బలంగా ఢీకొంది. దీంతో బాలుడి కాలికు తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి వచ్చిన మంత్రి సరక బాలుడికి మెరుగైన చికిత్స అందిస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లోకి బీజేడీ నాయకులు



నీలకంఠతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కోట్‌పాడ్‌లో అధికార బీజేడీకి షాక్ తగిలింది. ఆ పార్టీ నేత, కోట్‌పాడ్ పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు నీలకంఠ పూజారి, అతని అనుచరులు బీజేడీని వీడి కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. కార్యక్రమంలో సమితి కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రకాశ్ చంద్ర మహంతి, కోట్‌పాడ్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బభూన్ త్రిపాఠీ, పీసీసీ సభ్యుడు, సీనియర్ న్యాయవాది మణిప్రసాద్ పట్నాయక్, నేతలు మనోహర బిసాయి, పరశురాం చలాన్, మాజీ సర్పంచ్ సొనారు చలాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బైక్

జయపురం: రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధి అండాగుడ పోలీసు పంటి ప్రాంతంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ప్రమాదం జరిగినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే అంబాగుడ పోలీసు పంటి అధికారి రవీంద్ర కుమార్ రథ్ సంఘటన ప్రాంతానికి చేరుకొని క్షతగాత్రులను జయపురం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

నేడు రంగోయిలో గిరిధర గొమాంగో జుగల్‌బందీ

పలాస : మండలంలోని రంగోయి గ్రామంలో ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ డప్పు కళాకా రుడు గిరిధర గొమాంగో జగల్ బందీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా జాన పద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు చెప్పారు. శనివారం రంగోయిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి బద్రి అప్పన్న పేరిట 20 ఏళ్ల క్రితం 2004లో కళాపీఠం ఏర్పాటు చేశామని, అప్పటి నుంచి ఏటా జానపద కళాకారులను రంగోయి గ్రామానికి సంక్రాంతి సందర్భంగా ఆహ్వానించి వారి ఆట పాటలను సమాజానికి పరిచయం చేస్తున్నామని చెప్పారు. పేద కళాకారులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి జానపద జాతర ప్రారంభమవుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ చిగిచర్ల కృష్ణారెడ్డి, అంతర్జాతీయ నృత్య కళాకారిణి నిర్మలా నృత్యనికేతన్, రాయలసీమ జానపద గాయకురాలు అనంత ఆణిముత్యం, ప్రవాసాంధ్ర గాయకులు, కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ తదితరులు హాజరై తమ ఆటపాటలతో అలరించనున్నారని వివరించారు.

చీటింగ్ కేసులో ఇద్దరు అరెస్టు



అరెస్టైన నిందితులు

బరంపురం: ఫినా ఫైనాన్స్ బ్యాంక్ పేరున నకిలీ ధ్రువపత్రాలు తయారు చేస్తున్న ఇద్దరు నిందితులను టౌన్ పోలీసులు అరెస్టు చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. నగర కొత్త బస్టాండ్ రోడ్డులో నివాసముంటున్న రబి నారాయణ మహరణ, ప్రేమ్‌నగర్ 5వ లైన్‌లో నివాసముంటున్న పింకు పాత్ర ఇళ్లపై శనివారం దాడులు చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బ్యాంక్ పేరున ఉన్నటువంటి నకిలీ ధ్రువపత్రాలు, పాస్ పుస్తకాలు, నకిలీ స్టాంపులు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ అధికారి సురేష్ కుమార్ రథ్ తెలియజేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



రాయగడ: వాక్‌థాన్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు



జయపురం: ర్యాలీలో ప్లకార్డులతో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

రాయగడ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక రీజనల్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల మధ్య వాకథాన్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆర్టీవో శివశంకర్ చౌదరి మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీ నుంచి రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. జాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

జయపురం: నగరంలో రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడ మాట్లాడుతూ.. అధిక వేగంతో వాహనాలు నడపరాదని, వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బి.సి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు వేటగాళ్లు అరెస్టు



అరెస్టైనవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: కొద్ది రోజులుగా అటవీ చట్టానికి వ్యతిరేకంగా వివిధ రకాల వన్య ప్రాణులను చంపుతూ వాటి మాంసం, చర్మం విక్రయిస్తున్న నలుగురు నేరస్తులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన నగరంలో సంచలనం రేపింది. ఏఎస్పీ ప్రభాత్ కుమార్ రౌథ్‌రాయ్ తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గోళంతరా పోలీసుస్టేషన్ పరిధి లాకడి అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులను వేటాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశాలతో గోళంతరా పోలీసులు దాడిచేసి నలుగురు వేటగాళ్లను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి 2 నాటు తుపాకీలు, 125 గుండ్లు, 2 దుప్పి కళేబరాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో పుర్ణో గౌడో, శంకర్ ప్రదాన్, బలియా పల్లిక్, బృందవన్ సబత్‌లు ఉన్నట్లు గుర్తించారు. వీరిని బరంపురం జిల్లా కోర్టులో హాజరపరిచి సర్కిల్ జైలుకి తరలించారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీలు, లేడి కొమ్ములు, తుపాకీ గుండ్లు

బీఎస్ఎఫ్ జన సంపర్క్ శిబిరం



చిన్నారులతో బీఎస్ఎఫ్ జవాన్లు

మల్కన్‌గిరి:

జిల్లాలోని చిత్రకొండ సమితి పిపలపోదర్ గ్రామం వద్ద 88 బెటాలియాన్ బీఎస్ఎఫ్ జవాన్లు నక్కమామ్ముడి పంచాయతీ ఖర్కాగూడ గ్రామం వద్ద జన సంపర్క్ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. బెటాలియాన్ కామాండర్ అనిల్ చౌహాల్, అసిస్టెంట్ కామాండార్ కృష్ణచంద్ర నియాల్‌తో ఇతర సిబ్బంది పరిసర గ్రామాలకు చెందిన 150 మందికి దుస్తులు, చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు, నిత్యవసర వస్తువులు, తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా చౌహాల్ మాట్లాడుతూ.. చిన్నారులను చదివించాలని సూచించారు. అనునిత్యం అక్కడి ప్రజలకు అండగా ఉంటామని తెలియజేశారు.



భోజనం ప్లేట్లు పంపిణీ చేస్తున్న జవాన్లు

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

విజయనగరం ఫూల్‌బాగ్: సంక్షేమ పింఛన్‌ను మూడు వేల రూపాయలకు పెంచడంతో పట్టణంలోని 22వ డివిజన్ పరిధి డకిన్‌వీధి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కార్పొరేటర్ భవిరెడ్డి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామేశ్వరపు రామ రావు, సాయి, రవి, అప్పారావు, ప్రకాశ్, తదిత రులు పాల్గొన్నారు.

వంగర పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ చక్రవర్తి

వంగర: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి శనివారం తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, కేసుల నమోదు, సమస్యాత్మక గ్రామాలపై సీఐతో చర్చించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ రోజు గస్తీ నిర్వహించాలని, గ్రామాల్లో వివాదస్పద వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తీసుకోవాల న్నారు. పండగ వేళ పేకాట శిబిరాలు, పొట్టేళ్ల పందాలపై నిఘా పెట్టాలన్నారు. ఆయన వెం ట రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా పడి యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెం దిన గవిడి కిషోర్(ఫైల్)

దత్తిరాజేరు: మండలంలోని దత్తి కూడలి సమీపంలో చుక్కపేట రోడ్డులో అదుపు తప్పి కారు బోల్తా పడడంతో పోరలి గ్రామానికి చెందిన యువకుడు గవిడి కిషోర్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. దత్తిరాజేరు గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి అనిల్ గాయాల పాలైనట్టు పెదమానాపురం ఏఎస్‌ఐ కాశీరావు శనివారం తెలిపారు. ప్రమాదానికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు.. శుక్రవారం అర్ధరాత్రి దత్తి రాజేరు గ్రామానికి చెందిన స్నేహితులను కిషోర్ చుక్కపేటలో విడిచిపెట్టి తిరుగు ప్రయాణంలో దత్తిరాజేరు వస్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలిపారు. మృతి చెందిన కిషోర్‌ను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించి శవ పంచనామా అయిన వెంటనే కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు తెలిపారు. మృతుడు తండ్రి చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి తల్లి రమణమ్మ, సోదరుడు ధనుంజయ్ ఉన్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పార్వతీపురం టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నం నుంచి రాయగడ వెళ్లే గూడ్స్ రైలు గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొందని తెలిపారు. ఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందినట్టు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి వుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుని వివరాలు తెలిస్తే తక్షణమే పార్వతీపురం జీఆర్‌పీ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

విధులకు హాజరుకావాలి

పార్వతీపురంటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఈ నెల 8వ తేదీన విధులకు హాజరుకావాలని మహిళా శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి ఎం.ఎన్.రాణి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం విధించిన గడువులోగా విధులకు హాజరుకాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్య సురక్షతో కంటి వెలుగులు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వరకు పలు కార్యక్రమాలు చేపట్టి పకడ్బందీగా అమలు చేస్తోంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్షలో వేల సంఖ్యలో నేత్ర రోగులకు కంటి వెలుగులు ప్రసాదిస్తోంది.

- తొలి విడత జగనన్న ఆరోగ్య సురక్షలో 45,663 మందికి పరీక్షలు
- 3969 మందికి శస్త్రచికిత్సల కోసం గుర్తింపు
- 1316 మందికి కంటి శస్త్రచికిత్సలు పూర్తి
- 4776 మందికి కంటి అద్దాల పంపిణీ



రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా సాలికలో నిర్వహించిన శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: ప్రజారోగ్య పరిరక్షణకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతుంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. ఆరోగ్య ఆసరా పథకం కింద చికిత్స అనంతరం భృతిని కూడా అందజేస్తుంది. ఆపదలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చడానికి ఆధునాతన 108 అంబులెన్సుల ద్వారా తరలిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం కంటి రోగులకు చూపును ప్రసాదిస్తోంది.

కంటి సమస్యలున్న వారి కోసం ప్రత్యేక కౌంటర్

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కంటి రోగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అక్కడ కంటి పరీక్షలు చేస్తున్నారు. కంటి అద్దాలతో సమస్య పరిష్కారం అవుతుందనుకునే వారికి కంటి అద్దాల కోసం రిఫర్ చేస్తున్నారు. ఆపరేషన్ అవసరం అయ్యే వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు శస్త్రచికిత్సల కోసం రిఫర్ చేస్తున్నారు. చిన్నచిన్న సమస్యలు ఉన్న వారికి మందులు అందజేస్తున్నారు.

మొదటి విడతలో 45,663 మందికి పరీక్షలు

మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్షలో జిల్లాలో 541 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఇందులో 45,663 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 4776 మందికి కంటి అద్దాలను అందించారు. 3969 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్సల కోసం గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 1316 మందికి శస్త్రచికిత్సలు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వల్ల ఎంతో మంది కంటి సమస్యలు పరిష్కారమవుతున్నాయి. అంధత్వం బారిన పడకుండా కాపాడుకోగలుగుతున్నారు. ప్రస్తుతం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 2వ తేదీ నుంచి ప్రాంభమైంది.

ఉచితంగా కంటి ఆపరేషన్ చేశారు..



మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కన్ను సరిగా కనబడటం లేదని వెళ్లాను. అక్కడ నాకు కంటి పరీక్ష చేశారు. ఆపరేషన్ చేయాలని చెప్పారు. విజయనగరంలో ఉన్న పుష్పగిరి కంటి ఆస్పత్రికి వెళ్లాను. కొద్ది రోజులు క్రితం అక్కడ నాకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కంటి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాగానే కనుబడుతుంది.

– సంగిరెడ్డి అమ్మన్న, పెదబంటుపల్లి, గుర్ల మండలం

కంటి చూపు ఇప్పుడు బాగుంది..



నాకు ఒక కన్ను మసకమసకగా కనిపించేది. మా వీధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం వద్దకు వెళ్లాను. అక్కడ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేయాలని చెప్పారు. పట్టణంలో ఉన్న పుష్పగిరి ఆస్పత్రికి వెళ్లాలని చెప్పారు. అక్కడ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు నా కంటి చూపు బాగా కనిపిస్తోంది.

– కంది శ్రీను, అబాద్ వీధి, విజయనగరం

వేలాది మందికి కంటి పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వేలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించాం. అందులో కంటి అద్దాలు అవసరమైన వారికి అద్దాలను ప్రభుత్వం అందించింది. అదే విధంగా కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు ప్రభుత్వం చేయిస్తోంది.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

బెల్టు షాపుపై పోలీసుల దాడి



గజపతినగరం: పట్టుబడిన మద్యం సీసాలను చూపిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేంద్ర



సీతానగరం: మద్యం సీసాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐ రాజేష్



నెల్లిమర్ల రూరల్: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ నారాయణరావు, సిబ్బంది

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో మద్యం వ్యాపారం అక్రమంగా సాగిస్తున్న బెల్టు షాపు యజమాని వియ్యపు అప్పలరాజుపై దాడి చేసి 118 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ట్రైనీ డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన మద్యం సీసాలను చూపిస్తూ విలేకరులతో శనివారం మాట్లాడారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు మహేంద్ర తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి అక్రమ మద్యం వ్యాపారాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర జంక్షన్‌లో 27 మద్యం బాటిళ్లతో వస్తున్న బొడ్డవర గ్రామానికి చెందిన కాళ్ల సంతోష్‌కుమార్‌ను శనివారం అరెస్టు చేసినట్టు ఎస్.కోట ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. అక్రమంగా మద్యం తీసుకెళ్తున్న సంతోష్‌కుమార్‌ను కోర్టులో హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

బైక్‌లో మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం: పోలీసుల వాహన తనిఖీల్లో బైక్‌లో మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్‌ఐ ఎం.రాజేష్ తన సిబ్బందితో మండలంలోని సీతానగరం నుంచి పెదంకలాం, వెంకటాపురం, నిడగల్లు, బూర్జ, లక్ష్మీపురం గ్రామాల్లో వాహనాలను శనివారం తనిఖీలు చేశారు. బూర్జ శివారులో ద్విచక్ర వాహనాలను సోదా చేసే సమయంలో బలిజిపేట మండలం మురగడాం గ్రామానికి చెందిన వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్ బైక్‌లో వంద మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించారు. మద్యం సీసాలతో పాటు వాహనాన్ని నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టు షాపుపై దాడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాంలో బెల్టు షాపుపై పోలీసులు శనివారం దాడి చేశారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా అక్రమంగా మద్యం సీసాలు కలిగిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని ఆయన నుంచి 49 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగిస్తామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు



సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన జేఎన్‌టీయూ జీవీ జట్టు

విజయనగరం: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జేఎన్‌టీయూ జీవీ జట్టు సిద్ధమైంది. మొత్తం 15 మంది క్రీడాకారులతో కూడిన జట్టు వివరాలను శనివారం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య శనివారం ప్రకటించారు. జట్టులో ఎస్.తేజ (రఘు కాలేజ్), డి.కులశేఖర్ (శ్రీశివాని కాలేజ్), ఎం.యజ్ఞ పవన్‌కుమార్ (జేఎన్‌టీయూ జీవీ) టి.మోహన్ రిషి సాహిత్ (విజ్ఞాన్‌కాలేజ్) వి.సాయి నాగ దినేష్ (రఘు కాలేజ్), సిహెచ్.జయంత్ (ఎంవిజిఆర్ కాలేజ్), ఐ.జాన్‌పాల్ (ఆదిత్య కాలేజ్) ఎం.సాయి యశ్వంత్ (శ్రీవెంకటేశ్వర కాలేజ్), కె.యశ్వంత్ (సాయిగణపతి కాలేజ్), జె.జశ్వంత్ (రఘు కాలేజ్), వి.సునీల్ (ఎస్ఎస్ రాజు కాలేజ్), సిహెచ్.వరుణ్ తేజరెడ్డి (ఎంవీజీఆర్ కాలేజ్), డి.చైతన్య (విజ్ఞాన్ కాలేజ్), వై.జ్ఞానతేజ్ (శ్రీశివాని కాలేజ్) , బి.అభయ్‌శేఖర్ నాయకుడు (అవంతి కాలేజ్) క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు చెన్నైలోని హిందుస్తాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులను జేఎన్‌టీయూ జీవీ జట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎవి.పాపారావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.నాగరాజు, ఎం.ఎల్లారీశ్వరి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లాలోని అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఖాళీగా వున్న ఒక ఆశా వర్కర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ మండలం అన్నవరం పీహెచ్‌సీ అంపిలి గ్రామ సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కరు తప్పనిసరిగా సంబంధిత సచివాలయ పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో స్థానికంగా నివసించి ఉండాలని, వయస్సు 25 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు కలిగి వుండాలన్నారు. వివాహితులు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరోగ్య, సంక్షేమ పారిశుద్ధ్య, గర్భిణుల ఆరోగ్యం వంటి సమస్యలపై అవగాహన కలిగి వుండాలని, ఆరోగ్య సమస్య ల పరిష్కారానికి సానుకూల దృక్పథం కలిగి వుండాలని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత చెంది ఉండాలన్నారు. పై అర్హతలు కలిగిన అభ్యర్థులు జనవరి 12వ తేదీలోగా దరఖాస్తుతో పాటు విద్యార్హత నకలు సంబంధిత అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారికి నేరుగా అందజేయాలని సూచించారు.

సీతంలో ముగిసిన యూనిట్ 3డీ గేమింగ్ కార్యశాల



ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షకుడు సతీష్‌ను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎమ్.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో ఉన్న సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ రెండో, మూడో సంవత్సరాల విద్యార్థులకు యూనిట్ 3డీ గేమింగ్ టూల్ మీద ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ కార్యశాల నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తి కనబర్చారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థతో అనుబంధించబడిన శిక్షకుడు ఎమ్.సతీష్ కార్యక్రమాన్ని సులభతరం చేశారు. విద్యార్థులందరికీ గేమింగ్ టూల్ మీద చక్కగా తీర్చిదిద్ది కోడింగ్ కాంపిటేషన్‌లో పాల్గొనే విధంగా చేసి వారిలో ఆసక్తి పెంపొందించారు. విద్యార్థులు అనేక ఆటలను అభివృద్ధి చేశారు. ఈ యూనిట్ 3డీ గేమింగ్ టూల్‌పై విద్యార్థులు తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు. కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసపత్రాలను కళాశాల డైరెక్టర్ ఎమ్.శశిభూషణరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ గేమింగ్ మార్కెట్ 2028 నాటికి అమెరికా 3.1 బిలియన్ నుంచి అమెరికా 7.5 బిలియన్లకు పెరుగుతుందని, రిలయన్స్ పరిశ్రమలు కూడా ఈ మార్కెట్‌లోకి ప్రవేశించి, తద్వారా భారీ ఉద్యోగవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షకుడు ఎమ్.సతీష్‌ను కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి.రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక ఆర్టీసీ బస్ సర్వీసులు



సీహెచ్ అప్పలనారాయణ, జిల్లా ప్రజార వాణాధికారి, ఏపీఎస్ ఆర్టీసీ, విజయనగరం

విజయనగరం టౌన్: సంక్రాంతి పండగకు విజయనగరం జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ వరకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు సాధారణ చార్జీలతో నడుపుతామని జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్.అప్పలనారాయణ శనివారం తెలిపారు. ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి విజయనగరానికి ప్రత్యేక బస్సులు ఉంటాయన్నారు. టికెట్లను ఏపీఎస్‌ఆర్టీసీ ఆన్‌లైన్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. ప్రయాణికులు రెండు వైపులా ఒకేసారి టికెట్లు బుక్‌చేసుకునేవారికి చార్జీల్లో పదిశాతం రాయితీ ఇస్తామని తెలిపారు. అలాగే, పార్వతీపురం, విజయనగరం, విశాఖ, ఎస్.కోట రూట్లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

8, 9 తేదీల్లో ఎస్‌ఐ అభ్యర్థులకు శిక్షణ ఉత్తర్వులు

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన తుది పరీక్షలో ఉత్తీర్ణులైన విశాఖ రేంజ్ పరిధిలో సివిల్ ఎస్‌ఐ (పురుషులు, మహిళలు), ఏపీఎస్పీ ఆర్ ఎస్‌ఐ అభ్యర్థులకు శిక్షణ ఉత్తర్వులను ఈ నెల 8,9 తేదీల్లో అందజేస్తామని ఐజీ ఎస్.హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులందరూ ఆయా తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య విశాఖ రేంజ్ పోలీస్ కార్యాలయానికి తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

మత్స్యకారులకు మేలు చేస్తాం

- కేంద్రమత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల




కేసీసీ కార్డు అందజేస్తున్న కేంద్రమత్స్యశాఖ మంత్రులు పర్షోత్తమ్ రూపాల, మురగన్

పూసపాటిరేగ/నెల్లిమర్లరూరల్: మత్స్యకారులకు మేలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాల అన్నారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలోని మత్స్యకారులతో శనివారం మమేకమయ్యారు. మత్స్యకార సంఘాల సభ్యులు 179 మందికి కిసాన్‌క్రెడిట్ కార్డుల ద్వారా మంజూరైన రూ.25లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర పరిక్రమ కార్యక్రమంతో మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తాయన్నారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద రాయితీలు అందజేస్తున్నట్టు వెల్లడించారు. చింతపల్లి తీరంలో శాశ్వత జెట్టీ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. కేంద్రమత్స్యశాఖ సహాయమంత్రి ఎల్.మురగన్ మాట్లాడుతూ సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా 7 వేల కిలోమీటర్ల తీర ప్రాంతంలో పర్యటించినట్టు తెలిపారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ మత్స్యకారులకు పక్కా ఇంటి సదుపాయం కల్పించామన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్నట్టు వివరించారు. ఎంపీ జీవీఎల్ నరిసింహారావు మాట్లాడుతూ మత్స్యకారులకు మోదీ ప్రభుత్వం మేలుచేస్తోందన్నారు. కేంద్ర మంత్రులకు కలెక్టర్ నాగలక్ష్మి బొబ్బిలివీణను బహూకరించగా, ఎమ్మెల్యే బడ్డుకొండ దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, ఆర్డీఓ సూర్యకళ, పశుసంవర్థక శాఖ జేడీ విశ్వేశ్వరరావు, డీడీ రమణ, తహసీల్దార్ భాస్కరరావు, సర్పంచ్ బర్రి మొసలి, బీజేపీ విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరరావు, పి.రాజేష్, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 2047 నాటికి దేశం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని కేంద్ర సమాచార ప్రసార, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ అన్నారు. భోగాపురం మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో శనివారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను సందర్శించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మురుగన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను అర్హులైన వారికి చేర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలంతా ఉన్నత స్థితికి చేరుకునేందుకు పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉజ్వల యోజన కింద పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామన్నారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని 775 గ్రామాలకు గాను 475 గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యకళ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సహాయ మంత్రి మురుగన్, అధికారులు

సారా తయారీ కేంద్రాలపై దాడి

- 1450 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం



అప్పన్నదొరపాలెం గ్రామ సమీపంలో సారా తయారీ కేంద్రం వద్ద సీఐ చంద్రశేఖర్ తదితరులు

కొత్తవలస: మండలంలోని చిన్న మన్నిపాలెం, అప్పన్నదొరపాలెం, రామలింగాపురం, ముసిరాం గ్రామాల్లో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై కొత్తవలస, ఎస్.కోట సీఐలు చంద్రశేఖర్, బాలసూర్యారావు శనివారం ఏక కాలంలో దాడులను నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో చిన్నమన్నిపాలెం, అప్పన్నదొరపాలెం గ్రామాల్లోను, బాల సూర్యారావు ఆధ్వర్యంలో రామలింగాపురం, ముసిరాం గ్రామాల్లో ఈ దాడులను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 1450 లీటర్ల బెల్లం ఊట, సుమారు వంద లీటర్ల వరకు సారాను ధ్వంసం చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసుల రాకతో తయారీదారులు పరారీ అయ్యారు. సారా తయారీకి ఉపయోగించిన డ్రమ్‌లు, కుండలు, పొయ్యిలను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వీరజనార్ధన్, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరకు - విశాఖ రోడ్డులో ప్రమాదం


- బైక్‌ను ఢీకొన్న టూరిస్టు వ్యాన్
- ముగ్గురికి తీవ్ర గాయాలు

కొత్తవలస: అరకు - విశాఖ రోడ్డులో అప్పన్నపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌ను టూరిస్టు వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు.. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన కొర్రాయి రామకృష్ణ(34), జోగ చంద్రశేఖర్(34) అప్పన్నపాలెం గ్రామంలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. రోడ్డును దాటివెళ్లే సమయంలో అరకు నుంచి అతివేగంగా వస్తున్న టూరిస్టు వ్యాన్ బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు తుళ్లిపడిపోయారు. బైక్ సమీపంలో ఉన్న తుప్పల్లో పడిపోయింది. వ్యాన్ సమీపంలో మరో బైక్‌పై ఉన్న కొత్తవలస గ్రామానికి చెందిన పెదిరెడ్ల అప్పారావును కూడా ఢీకొట్టడంతో ఆయన కాలు విరిగిపోయింది. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రామకృష్ణ, చంద్రశేఖర్ గోపాలపట్నంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో, అప్పారావు కొత్తవలసలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టూరిస్టు వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ప్రమాదంలో తుప్పల్లోకి తుళ్లి పడిన బైక్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం



ప్రభుత్వ కళాశాల పరిశీలనకు వచ్చిననాక్ బృందం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ (నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కమిటీ) సభ్యులు శనివారం సందర్శించారు. కళాశాలలోని ప్రయోగశాలలు, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ విభాగాలను పరిశీలించారు. బోధనా పద్ధతులు, విద్యాప్రణాళిక అమలుతీరును ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసమూర్తి వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు డా.వి.ఎస్.సత్యనారాయణ, డా.ముస్తాక్ అహ్మద్‌దర్జి తదితరులు పాల్గొన్నారు.